క్లుప్తంగా

28 నుంచి బాలోత్సవం

తిరుపతి కల్చరల్: తిరుపతి బాలోత్సవం ఆధ్వర్యంలో ఈనెల 28, 29 తేదీల్లో రెండు రోజుల పాటు నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో పిల్లల పండుగ పేరుతో విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్టు ఆ సంస్థ వ్యవస్థాపకుడు మల్లారపు నాగార్జున తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బాలోత్సవం ప్రతినిధులతో కలిసి పిల్లల పండుగ పోటీల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వివిధ రంగాల్లో రాణించేలా ప్రోత్సహించే దిశగా తిరుపతి బాలోత్సవం ప్రతి ఏటా పిల్లల పండుగ పేరుతో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన ఎల్‌కేజీ నుంచి పదో తరగతి విద్యార్థులు సుమారు 8 వేల మంది పాల్గొంటారని తెలిపారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. తిరుపతి బాలోత్సవం గౌరవాధ్యక్షుడు టింకాయల దామోదరం, అధ్యక్షుడు నడ్డి నారాయణ, కోశాధికారి పరదాము జ్ఞానేశ్వరులు, బాలాజీ చౌదరి, తహసున్నీసా బేగం, కుప్పస్వామి, మునిలక్ష్మి, వెంకటరమణ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి కల్చరల్: వంగవీటి మోహన్ రంగా వర్ధంతిని పురస్కరించుకుని రాధారంగా మిత్రమండలి ఆధ్వర్యంలో గురువారం అనంతవీధి సర్కిల్లో పేదలకు అన్నదానం చేశారు. దీనికిముందు వంగవీటి మోహన్‌రంగ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరై అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో రాధారంగ మిత్రమండలి అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, విజయకుమార్, రమణ, ఆముదాల తులసీరామ్, వినోద్ రాయల్, మౌల, నీలాద్రి, సునీల్ చక్రవర్తి, శేషాద్రి, జయంతి, శిరీష, మధుబాల పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ



అవగాహన ర్యాలీలో తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు, సిబ్బంది

తిరుపతి రూరల్: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపారు. హెల్మెట్ ధరించడంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా గురువారం రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి అవిలాల సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ చిన్నగోవిందు మాట్లాడుతూ బైక్‌లపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణనష్టాలను తగ్గించవచ్చన్నారు. హెల్మెట్ లేకుంటే భారీ జరిమానాలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే కలిగే నష్టాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐలు ఎస్కేమూర్తి, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ

తిరుపతి తుడా: స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలో వైద్య ఉద్యోగుల సంఘం ప్రచురించిన నూతన క్యాలెండర్, డైరీలను గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, ఆ సంఘం రాష్ట్ర నాయకులు లోకేష్ బాబు, నేషనల్ హెల్త్ మిషన్ ప్రెసిడెంట్ మొహినుద్దీన్, మురళీ, ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

లా కాలేజీలపై వీసీకి ఫిర్యాదు

తిరుపతి సిటీ: జిల్లాలోని పలు లా కాలేజీల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని అలాంటి వారిపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంక్షేమ సంఘం ఎస్వీయూ అధ్యక్షుడు తిరుమలేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడును కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రైవేటు లా కాలేజీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ 90 శాతం సీట్లు నాన్‌లోకల్ వారికి కేటాయించి సొమ్ము చేసుకుంటున్నారని మండిపడ్డారు. మరికొన్ని కళాశాలల్లో మూడేళ్ల కోర్సుకు సంబంధించి మొత్తం ఫీజు ఏకమొత్తంగా విద్యార్థుల నుంచి ముక్కుపిండి వసూళ్లు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

28న విలీన సభ

తిరుపతి కల్చరల్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రం వేదికగా ఈనెల 28న రెండు సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీల విలీన సభకు ప్రజలంతా తరలివచ్చి విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి హరికృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం నారాయణపురంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో పార్టీల విలీనసభ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వెంకయ్య, నగర కార్యదర్శి వెంకటరత్నం పాల్గొన్నారు.



మంగళం డిపో ప్రహారీగోడ కూలిపోయి 4 నెలలు గడుస్తుంది... అయినా అలానే ఉంది



కోటి కష్టాలు

- ఒకప్పుడు జిల్లాలోనే అధిక రాబడి కలిగిన డిపోల్లో మంగళం ఒకటి
- నేడు నెలకు రూ.కోటి నష్టం
- డిపోలో 4 నెలల క్రితం కూలిన ప్రహరీ
- ఆర్టీసీ బస్టాండ్ లోపల గుంతలమయం
- నెల ఖర్చులు రూ.5.45 కోట్లు అయితే రాబడి రూ.4.45 కోట్లే..!
- కనీస చర్యలు చేపట్టని ఆర్టీసీ యాజమాన్యం



తిరుపతి అర్బన్: జిల్లాలో బస్టాండ్ లేని ఏకైక ఆర్టీసీ డిపో మంగళం. ఒకప్పుడు రాబడిలో మంగళం డిపో ముందు వరుసలో ఉండేది. అయితే ప్రస్తుతం బాగా వెనుకబడిపోతోంది. అధికారులు డిపోలో ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడంతోనే ఇలాంటి పరిస్థితులు తలెత్తాయని పెద్దఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదాహరణకు నాలుగు నెలల కిందట మంగళం డిపో చుట్టు ఉన్న ప్రహరీ రెండు వైపులా కొంతభాగం పడిపోయింది. అయితే అధికారులు కనీసం దాని గురించి పట్టించుకోలేదు. దీంతో డిపోకు అన్ని వైపులా దారులు ఏర్పడి భద్రత కరువైందని పలువురు సిబ్బంది చెబుతున్నారు. డిపో లోపలి భాగం అంతా గుంతలమయం అయినా పట్టించుకునే దిక్కులేకుండా పోయిందని పలువురు డ్రైవర్లు వాపోతున్నారు. నెల రాబడి గతంలో రూ.5.5 కోట్ల నుంచి రూ.6.5 కోట్ల మేరకు వచ్చేది. ప్రస్తుతం రాబడి రూ.4.5 కోట్లకు పడిపోగా ఖర్చులు మాత్రం రూ.5.5 కోట్లు అవుతున్నాయి. అంటే నెలకు మంగళం డిపో ద్వారా ప్రభుత్వానికి రూ.కోటి నష్టం వాటిల్లుతోంది.

తిరుమల సర్వీసులతోనే కాస్త ఆదాయం..

తిరుమలకు నడుస్తున్న సర్వీసులతోనే మంగళం డిపోకు కాసింత ఆదాయం వస్తోంది. మిగతా మార్గాలపై ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. డిపోలో 78 సర్వీసులు ఉన్నాయి. అందులో 28 సప్తగిరి సర్వీసులు తిరుమలకు నడుస్తున్నాయి. 19 ఏసీ సర్వీసులు ఉన్నాయి. 8 స్లీపర్ సర్వీసులు, 23 ఆర్డినరీ సర్వీసులు ఉన్నాయి.

కూలడానికి సిద్ధంగా బస్ షెల్టర్

మంగళం డిపో సమీపంలో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ వర్షాలతో కింది భాగం పూర్తిగా దెబ్బతింది. ఏ క్షణం కూలిపోతుందో తెలియడం లేదు. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. వెంటనే మరమ్మతులు చేయాల్సి ఉంది. లేదంటే ప్రమాదం తప్పేలా లేదని పలువురు ఆందోళన చెందుతున్నారు.

ఆదాయం పెరిగేలా చూస్తాం



ఇటీవల కాలంలో మంగళం డిపో రాబడి తగ్గిన మాట వాస్తవమే. పెంచడానికి కృషి చేస్తాం. మరోవైపు వర్షాలతో నాలుగు నెలల క్రితం మంగళం డిపో ప్రహరీ గోడ పడిపోయింది. తిరిగి నిర్మించడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నాం. డిపోలోని గుంతలను పూడ్చేప్రయత్నం చేస్తాం. తిరిగి పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తాం.

– కేసీడీ భాస్కర్, మంగళం డిపో మేనేజర్

మంగళం డిపో సమాచారం

బస్సుల సంఖ్య –	78
కండక్టర్లు –	96 మంది
డ్రైవర్లు –	230 మంది
మెకానిక్స్, ఇతర సిబ్బంది –	104
మొత్తం ఉద్యోగులు –	430 మంది
నెల రాబడి –	రూ.4.45 కోట్లు
నెల డీజిల్ ఖర్చులు –	రూ.2.90 కోట్లు
ప్రతినెల ఉద్యోగుల జీతాలు –	రూ.2.40 కోట్లు
మెయింటినెన్స్ ఖర్చులు, రిపేర్లు –	రూ.15 లక్షలు
మొత్తంగా నెల రాబడి –	రూ.4.45 కోట్లు
నెలసరి ఖర్చులు –	రూ.5.45 కోట్లు
నెలకు నష్టం –	రూ.కోటి



మంగళం డిపో సమీపంలో కూలడానికి సిద్ధంగా ఉన్న బస్సు షెల్టర్

నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట



భూమన అభినయరెడ్డి (ఫైల్)

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి ప్రజలపై కరెంట్ చార్జీలు, ధరలను విపరీతంగా పెంచుతున్నారని తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోనే రూ.15 వేల కోట్లను కరెంట్ చార్జీల రూపంలో ప్రజలపై భారం మోపారన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు తిరుపతి పద్మావతిపురంలోని మాజీ ఎమ్మెల్యే, చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి నివాసం వద్ద నుంచి ర్యాలీగా శ్రీనివాస కల్యాణ మండపాల సమీపంలోని విద్యుత్‌శాఖ ప్రధాన కార్యాలయం వద్ద నిరసన చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం సమర్పించడం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

పోరుబాటను జయప్రదం చేయండి



చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి: కరెంట్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ శుక్రవారం తలపెట్టిన పోరుబాట కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలను పెంచమని చెప్పి, ఇప్పుడు ప్రజల నడ్డి విరిచేలా కరెంట్ చార్జీలను పెంచిందని ఆయన ఆరోపించారు. తక్షణం పెంచిన కరెంటు చార్జీలను వెంటనే తగ్గించాలని కోరుతూ చంద్రగిరి ఈఆర్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేస్తామన్నారు. చంద్రగిరి టవర్ క్లాక్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీగా నడుచుకుని వెళ్తామని, ఆ మేరకు ఉదయం 9.30 గంటలకు అందరూ టవర్ క్లాక్ వద్దకు చేరుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

శాంతాక్లాజ్ టోపి పెట్టిన వ్యక్తి అరెస్టు



నిందితుడు భందుదార్జీ

తిరుపతి క్రైం: అన్నమయ్య విగ్రహంపై ఈనెల 23వ తేదీన శాంతా క్లాస్ టోపీ ఉంచిన వ్యక్తిని ఈస్ట్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వివరాలు.. మహారాష్ట్రలోని మరియూ జిల్లా పర్భానీ తాలుకా పెడ్గోన్ గ్రామం శివాజీ నగర్‌కు చెందిన ధారాజీ జవనార్ కుమారుడు భందుదార్జీ జవనార్(73)గా పోలీసులు తెలిపారు. గత కొంతకాలంగా ముద్దాయి భందుదార్జీ ఇంటిపట్టున ఉండకుండా తిరుగుతూ ఉండేవాడని, 15 రోజుల కిందట తిరుపతి నగరానికి వచ్చిన అతడు చిత్తు పేపర్లు సేకరిస్తూ ప్లాట్‌ఫామ్‌పై నిద్రించేవాడన్నారు. ఈ నెల 23వ తేదీన అన్నమయ్య సర్కిల్ పరిధిలో ఎర్రటి శాంతాక్లాస్ టోపీ దొరడంతో అన్నమయ్య సర్కిల్‌లో అన్నమయ్య విగ్రహం తలపై ఉంచాడని తెలియజేశారు. గత మూడు రోజులుగా ప్రత్యేక బృందాలతో గాలించగా గురువారం తిరుచానూరు సింధు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద సంచరిస్తుండగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. హిందూ మనోభావాలను దెబ్బతినేలా వ్యవహరించిన నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపినట్లు చెప్పారు.

ఉద్యాన పంటలపై దృష్టి

తిరుపతి అర్బన్: ఉద్యాన పంటల సాగు పెంచేలా ఏపీఎంఐపీ వారు రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన ఉద్యానశాఖ సూక్ష్మ మైక్రో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏ పంటలు సాగుచేస్తే దిగుబడి అధికంగా వస్తుంది, మార్కెట్‌లో ధరలు ఉన్నాయి అనే అంశాలను రైతులకు తెలియజేయాలని చెప్పారు. ఉద్యానశాఖ జిల్లా అధికారి దశరథరామిరెడ్డి, సూక్ష్మ మైక్రో ఇరిగేషన్ జిల్లా అధికారి సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా వీర్ బాల్ దివస్



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న గుండాల గోపినాథ్‌రెడ్డి

తిరుపతి గాంధీరోడ్డు: స్థానిక రాములవారి గుడి వీధి, ఉత్తర మాడవీధిలో వీర్ బాల్ దివస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు గుండాల గోపినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో గురుద్వార్‌లోని సిక్కు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు చిత్రలేఖనం పుస్తకాలు, పెయింటింగ్ కలర్స్ బ్రెష్‌లు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహ బహుమతులను అందించారు. జేపీ ధనసింగ్, సుజాతబాయ్, గాయత్రి బాయ్, రాధిక భాయ్, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్యమా..!



మట్టితో పూడుకుపోయిన డ్రైనేజీ కాలువ

తిరుపతి తుడా: తిరుపతి నగరం గొల్లవానిగుంటలో ఇటీవల తాగునీటి అవసరాల కోసం రోడ్డును తవ్వారు. ఆపై పైపులైన్ వేసి అదే మట్టితో పూడ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. పైపులైన్ కోసం తవ్విన మట్టిని పక్కనే ఉన్న మురుగు కాలువలో పడేశారు. రోడ్డుపై ఉన్న మట్టితో గాడిని పూడ్చేసిన కాంట్రాక్టర్ తన పని అయిపోయిందని వెళ్లిపోయారు. సగానికి పైగా మట్టిని రోడ్డుపైనే వదిలేశారు. దానికితోడు డ్రైనేజీ కాలువలో పడిన మట్టి తొలగించకుండా తమకేమీ సంబంధం లేదన్నట్టు నిర్లక్ష్యంగా వెళ్లిపోయారు. దీంతో కాలువలో మట్టి దిబ్బలు ఉండడంతో మురుగునీరు స్తంభించిపోయింది. తీవ్ర దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల బెడద ఎక్కువైందని స్థానిక మహిళలు లబోదిబోమంటున్నారు. కాంట్రాక్టర్ చేసిన నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. డ్రైనేజీ కాలువలో అడ్డుపడిన మట్టిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఇంజినీరింగ్ అధికారులు ఇప్పటికైనా చొరవ తీసుకుని సంబంధిత కాంట్రాక్టర్ ద్వారా కాలువల్లో పడిన మట్టిని తొలగించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఉచిత శిక్షణ ప్రారంభం

చంద్రగిరి: మండల పరిధిలో మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో నారావారిపల్లిలో జూట్ బ్యాగ్స్ అల్లిక శిక్షణ ప్రారంభించామని స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సూచనలతో స్వయం ఉపాధి కేంద్రం ఏర్పాటుకు నారావారిపల్లిని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారని చెప్పారు. కార్యక్రమంలో డీపీఓ సుశీల దేవి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శేఖర్, స్వయం ఉపాధి మహిళలు, అధికారులు, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు

భాకరాపేట : పార్టీలకు అతీతంగా అభివృద్ధిని చేద్దామని ఎమ్మెల్యేనాని అన్నారు. చిన్నగొట్టిగల్లు మండల మీట్ ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏనుగుల దాడిలో నష్టపోయిన పంటలకు సంబంధించి అంచనాలు వేసి నివేదికలు వెంటనే ఇవ్వాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, సునీత, ఎంపీటీసీ లు, సర్పంచులు, కో–ఆప్షన్ మెంబర్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ రామ్మోహన్

పాకాల : భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు, నిర్వహిస్తున్నామని ఆర్డీఓ రామ్మోహన్ తెలిపారు. గురువారం మండలంలోని గాదంకి పంచాయతీలో తహసీల్దార్ నిత్యానందబాబు ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. సదస్సుల్లో స్వయంగా ఆయనే ప్రజల అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రామ్మోహన్ మాట్లాడుతూ భూ సమస్యలను సులభతరంగా పరిష్కరించుకోవడానికి అనువైన వేదిక రెవెన్యూ సదస్సులు అని అన్నారు. వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని అక్కడికక్కడే పరిష్కరించేలా చొరవ చూపాలని అన్నారు.

శ్రీవారి నమూనా ఆలయ ఏర్పాటుపై సమీక్ష



నమూనా ఆలయ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న జేఈఓ

తిరుపతి సిటీ: ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో జరగనున్న మహాకుంభమేళాకు టీటీడీ తరపున నమూనా ఆలయ నిర్మాణం పనులను సకాలంలో పూర్తి చేయాలని టీటీడీ తిరుపతి జేఈఓ గౌతమి అధికారులను ఆదేశించారు. టీటీడీ పరిపాలనా భవనంలోని మీటింగ్ హాల్‌లో గురువారం అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వచ్చేనెల 13 నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు యూపీ మహాకుంభ మేళా జరగనున్న నేపథ్యంలో టీటీడీ పాలకమండలి నిర్ణయం మేరకు ఈఓ శ్యామలరావు ఆదేశాలతో తిరుమల స్వామివారి ఆలయంలో జరుగుతున్న కైంకర్యాలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. 12 ఏళ్లకు ఓసారి జరిగే పుష్కరాలు.. ఈ ఏడాది ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్నాయని, అక్కడకు వచ్చే అశేష భక్తులు స్వామివారిని దర్శించుకునే అవకాశం టీటీడీ కల్పిస్తోందన్నారు. 13వ తేదీ నుంచి సుప్రభాత సేవ, ఏకాంతసేవ వరకు అన్ని సేవలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామివారి ప్రసాదాలు, కళా ప్రదర్శనలు, స్వామివారి విశిష్టత తెలిపే పుస్తకాలను హిందీ, ఇంగ్లీష్ భాషలలో ముద్రించి భక్తులకు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, టీటీడీ పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో నిరసన



న్యాయం కోసం నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

తిరుపతి అర్బన్: మంగళంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు వద్ద పలువురు తమకు న్యాయం చేయాలంటూ నిరసన వ్యక్తం చేశారు. గురువారం తిరుపతి మంగళం పరిధిలోని ధర్మరాజుల గుడి సమీపంలో తిరుపతి అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించగా 69 అర్జీలు వచ్చాయి.

పలువురు నిరసన..

శెట్టిపల్లి పంచాయతీ పరిధిలోని మంగళం లెక్కదాఖలాలో సర్వే నంబర్ 30 పరిధిలో 2.71 ఎకరాల్లోని 116 ప్లాట్లను తాము కొనుగోలు చేశామని, ఇప్పుడు ఆ ప్లాట్లలో నిర్మాణాలు చేపడుతుంటే రెవెన్యూ అధికారులు అడ్డుకుంటున్నారని పలువురు బాధితులు నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలంటూ వారు నిరసన తెలిపారు.

నకిలీ డాక్యుమెంట్లతో బెంబేలు..

మంగళం పరిధిలో భూముల ధరలు కోట్ల రూపాయిలు పలుకుతుండడంతో కొందరు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఇతరుల భూములను సొమ్ము చేసుకునే పనిలో పడ్డారు. దీంతో ఆ ప్రాంతంలోని నిజమైన భూహక్కుదారులు, ప్లాట్స్ ఉన్న వారు టెన్షన్ పడుతున్నారు. సప్తగిరికాలనీకి చెందిన ఆరుగురికి చెందిన ప్లాట్లకు కొందరు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి విక్రయించారని బాధితులు ఆవేదన చెందారు. తమకు న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు. అలాగే మిట్టగాంధీపురానికి చెందిన వారు తమ పరిధిలోని శ్మశానాన్ని కొందరు ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అదేవిధంగా మంగళంకు చెందిన కొందరు తమ వ్యవసాయ భూములను ఆక్రమిస్తున్నారని, రక్షణ కల్పించాలని కోరారు.

ఎస్వీయూలో పులి కలకలం..!

తిరుపతి సిటీ: ఎస్వీయూ ప్రకాశం నగర్ క్వార్టర్స్‌లో గురువారం రాత్రి పులి సంచరిస్తోందని ప్రత్యక్షంగా తాము చూశామంటూ పలువురు వర్సిటీ ఉద్యోగులు చెప్పుకొచ్చారు. దీంతో క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న ప్రజలు బయటకు రావద్దని ఉద్యోగులు వాట్సాప్ మెసేజ్‌లు, ఫోన్ల ద్వారా అప్రమత్తం చేస్తున్నారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ, సీఎస్‌ఈ విభాగాల పరిసర ప్రాంతాలలో నుంచి క్వార్టర్స్‌లోకి ప్రవేశించిందని వర్సిటీ అధికారులకు, ఫారెస్ట్ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న ఉద్యోగులు తలుపులు తీయకుండా బిక్కు బిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు.

టీటీడీ క్యాలెండర్లకు బారులు

తిరుపతి సిటీ: టీటీడీ క్యాలెండర్ల కోసం భక్తులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. శ్రీనివాస వసతి సముదాయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో క్యాలెండర్లు అందుబాటు లేవు. విష్ణునివాసం, గోవిందరాజ స్వామి టెంపుల్ సమీపంలోని టీటీడీ పుస్తక ప్రదర్శన కౌంటర్‌లోనూ ఇదే పరిస్థితి. టీటీడీ ఏడీ బిల్డింగ్ ఎదుట గల కౌంటర్లో మాత్రమే కొన్ని రకాల క్యాలెండర్లు అందుబాటులో ఉండడంతో గురువారం పెద్ద సంఖ్యలో స్థానికులు బారులు తీరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. క్యూలైన్ల వద్ద వృద్ధులు, మహిళలు పెద్దసంఖ్యలో బారులు తీరగా, కనీసం నీటి వసతి, పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనబడింది.

పదే పదే అంటే.. అక్కడ ట్రంప్ తరుముతాడు



నిరసన వ్యక్తం చేస్తున్న కేంద్ర మాజీమంత్రి చింతామోహన్

తిరుపతి సిటీ: అన్యమతస్తులు అంటూ టీటీడీలోని ప్రముఖులు అనాలోచితంగా మాట్లాడడం దారుణమని, ఈ విషయం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వరకు వెళ్తే పెద్ద ప్రమాదమే ఎదురవుతుందని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ అభిప్రాయపడ్డారు. గురువారం తిరుపతి టీటీడీ పరిపాలన భవనం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానికులు, టీటీడీ అర్చకులు, శాశ్వత ఉద్యోగస్తులు, జర్నలిస్టుల సమస్యలపై నిరసన గళం వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్విమ్స్‌లో నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం స్విమ్స్‌కు అంతర్జాతీయ హోదా గతంలోనే కల్పించిందని, ఇప్పుడు కొత్తగా జాతీయ హోదా కల్పించాలని టీటీడీ బోర్డు మీటింగ్‌లో తీర్మానించడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సర్వదర్శనానికి 20 గంటలు



శిలాతోరణం వరకు భారీ క్యూ

తిరుమల: తిరుమలలో రద్దీ పెరిగింది. టీటీడీ అధికారుల సమాచారం మేరకు స్వామి వారి సర్వదర్శనానికి సుమారు 20గంటల సమయం పట్టే అవకాశం ఉంది. ఇప్పటికే అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. శిలాతోరణం వరకు క్యూ విస్తరించింది. బుధవారం 73,301 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 26,242 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.14 కోట్లు లభించింది.

ఘనంగా సీపీఐ శతాబ్ది వేడుకలు



కేక్ కట్ చేసి పార్టీ ఆవిర్భావ సంబరాలు జరుపుకుంటున్న సీపీఐ నేతలు

తిరుపతి కల్చరల్: సీపీఐ శతాబ్ది వేడుకలను పురస్కరించుకుని గురువారం తిరుపతి నగరంలో సీపీఐ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ శత వసంతాల వేడుకలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా అన్నమయ్య సర్కిల్ నుంచి కార్మికులు, కర్షకులతో భారీ ఎత్తున ఎర్రజెండాలు చేతపట్టి బైరాగిపట్టెడలోని పద్మావతి పార్కు వద్దకు ర్యాలీ చేపట్టారు. అక్కడ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద పార్టీ నేతలు పతాకాన్ని ఆవిష్కరించి, అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. గంధమనేని శివయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో హరినాథరెడ్డి మాట్లాడుతూ దేశమంతటా కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవాన్ని నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు పాల్గొన్నారు.